ఆరోగ్య సంరక్షణలో అప్రమత్తంగా ఉండాలి



మణికొండ: ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో అప్పుడప్పుడు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలను చేయించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ సెక్రటేరియట్ ఎంప్లాయీస్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగరాజు అన్నారు. కాలనీలో శ్రీ త్రికూటేశ్వర స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆశ్రయ్ ఆకృతి స్వచ్ఛంద సంస్థ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, అలాంటి వాటికి ఎప్పటికప్పుడు పరీక్షలను నిర్వహించుకుని వైద్యుల సలహాలను పొందాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పెద్ద ఎత్తున పరీక్షలు చేయించుకున్నారు.

కురుమ సంఘం నాయకులకు సన్మానం



మణికొండ: మణికొండ గ్రామ కురుమ సంఘం నాయకులుగా ఎన్నికైన వారికి మాజీ ప్రజాప్రతినిధులు సోమవారం ఘనంగా సన్మానించారు. కురుమ సంఘం అధ్యక్షుడు సి.బీరప్ప, ప్రధాన కార్యదర్శిగా ఈదుల కంటి వెంకటేశ్ ఆదివారం ఎన్నికయ్యారు. దాంతో వారిని సోమవారం మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు వారిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కురుమ సంఘం సభ్యుల అభ్యున్నతికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు.

వరంగల్ సభను విజయవంతం చేయాలి

బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి



మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

శంషాబాద్: వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ సభను విజయంతం చేయాలని ఆ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మంచర్ల మోహన్‌రావు ఆధ్వర్యంలో సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగెత్తిపోయారన్నారు. ప్రతి పల్లె నుంచి సభకు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు జనాలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి లక్షకు పైగా పార్టీ శ్రేణులు సభకు తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజాసమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడుతూ పార్టీ శ్రేణులు ప్రజల్లో ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జయమ్మ, డీసీసీబీ డైరెక్టర్ బి.సతీష్, పూతలే మురళీధర్‌రెడ్డి, సత్యనారాయణ,గౌస్‌పాషా, శంకర్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి అమ్మినా.. అప్పగించకుండా రుబాబు!

కబ్జాలో ఉన్న వ్యక్తిపై ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో కేసు

శంషాబాద్: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఇద్దరు అన్నదమ్ములు ఆస్తిని అమ్ముకున్నారు. ఆపై లీజు ఒప్పందం చేసుకుని అందులోనే ఐదేళ్లుగా వ్యాపారం చేసుకున్నారు. ఇటీవల లీజు గడువు ముగిసినా కబ్జా నుంచి పక్కకు జరగకుండా కొనుగోలుదారుపై రుబాబు చూపిస్తున్న అన్నదమ్ముల్లో ఒకరిపై ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం... శంషాబాద్‌లో జాతీయ రహదారి పక్కనే ఉన్న 435 గజాల స్థలంలో మూడంతస్తుల్లో 2019 రెయిన్‌బో హోటల్‌ను నగరానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు బాసిత్, అన్వర్‌లు నిర్మాణం చేశారు. అదే సమయంలో బ్యాంకుల్లో అప్పులు పెరిగిపోవడంతో విద్యానగర్‌కు చెదిన సి.వి బ్రహ్మచారితో పాటు ఆయన భార్య అరుణ, ముగ్గురు కుమారులకు భవనాన్ని విక్రయించి సేల్‌డీడ్ చేశారు. ఆ తర్వాత లీజు ఒప్పందంతో గత ఐదేళ్లుగా ఆ భవనాన్ని అనుభవిస్తున్నారు. లీజుతో వ్యాపారం చేస్తున్న అన్నదమ్ములు కూడా విడిపోవడంతో అందులో ఒకరైన బాసిత్ అందులోనే హోటల్ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాడు మూడు నెలల కిందట లీజు ఒప్పందం కూడా పూర్తి కావడంతో దానిని కొనుగోలు చేసిన యజమానికి చారీ తన భవనాన్ని ఖాళీ చేయమని కోరడంతో రాజకీయ నేతలు, ఇతరత్రా మార్గాల్లో బాసిత్ సంబంధిత వ్యక్తులు ఖాళీ చేయకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఫిర్యాదును పరిశీలించిన పోలీసులు కబ్జాలో ఉన్న వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వట్టినాగులపల్లిలో ర్యాలీ...



హిమాయత్‌సాగర్‌లో సంవిధాన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్
- పలు ప్రాంతాల్లో సందడిగా 'జై బాపూ జై భీమ్ జై సంవిధాన్'

బండ్లగూడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలతో దేశవ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. జై బాపూ జై భీమ్ జై సంవిధాన్ సమావేశాన్ని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్‌సాగర్‌లో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. హిమాయత్‌సాగర్ పురవీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ... జై బాపూ, జై భీమ్ జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు, ఆ తరువాత దేశంలో కాంగ్రెస్ చేసిన అభివద్ధితోపాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నేతలు రాందాస్ ముదిరాజ్, మహేందర్‌గౌడ్, సాగర్‌గౌడ్, సురేష్‌గౌడ్, కృష్ణారెడ్డి, ఆంజనేయులు, మలాకీ రత్నం, దయానంద్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో...

మైలార్‌దేవ్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ వాంబే కాలనీ చౌరస్తా వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వాంబే కాలనీ చౌరస్తా నుంచి చేపట్టిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... జై బాపూ, జై భీమ్ జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ధనుంజయ్, నాయకుడు సరికొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

మణికొండ: దేశంలో జీవించే ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించటంతో పాటు దాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని సోమవారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి, మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడలలో ఏఐసీసీ సభ్యుడు సంపత్‌కుమార్, మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రోజు, రోజుకు కొన్ని ప్రభుత్వాలు, పార్టీలు రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నాయన్నారు. అలాంటి వారికి ప్రజలు సందర్భం వచ్చినపుడు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్‌ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.అశోక్ యాదవ్, ఎం. జితేందర్, మాజీ కౌన్సిలర్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ప్రతులతో పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు.



మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో...

పోషకాహారంతోనే ఆరోగ్య సమాజం



సామూహిక సీమంతంలో పాల్గొన్న గర్భిణులు

-ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆర్‌జేడీ మోతి

మణికొండ: గర్భిణులు, బాలింతలు మంచి పోషకాహారం తీసుకున్నపుడే రాబోయే సమాజం ఆరోగ్యకరంగా మరింత ఉత్తమంగా రూపొందుతుందని ఐసీడీఎస్ శేరిలింగంపల్లి ప్రాజెక్ట్ ఆర్‌జేడీ మోతీ పేర్కొన్నారు. సోమవారం నార్సింగి మున్సిపల్ కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మోతీ అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు పోషకాహార ఫలితాలను మెరుగుపర్చటం, పోషకాహార లోపాలను సరిచేయటం, వాటిపై అవగాహన పెంచటానికి ఈ కార్యక్రమాన్ని ఏప్రిల్ 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు అన్ని గ్రామాలలో నిర్వహిస్తున్నామన్నారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. గర్భిణులకు కూరగాయలు, ఆకు కూరలు, పండ్ల ప్రాముఖ్యతను వివరించారు. మాజీ కౌన్సిలర్ ఉషారాణి, మండల అంగన్‌వాడీ టీచర్ సంఘం అధ్యక్షురాలు సుధారాణి, ఆర్‌పీ జాను, సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు, మహిళలు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించం



గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన గోల్కొండ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని ఔట్ పేషంట్ రిజిస్ట్రేషన్ విభాగం, ఫార్మసీ, ఇంజక్షన్ రూమ్, ఔట్ పేషంట్స్ కన్సల్టేషన్ రూమ్‌లను సందర్శించారు. ముందుగా ఆయన ఫార్మసీ వద్ద మందుల కోసం నిలబడిన పేషంట్లతో మాట్లాడారు. వైద్యులు మీతో ఎలా మాట్లాడారు..రోగ వివరాలను అడిగి తెలుసుకున్నారా తదితర విషయాలపై ఆరా తీశారు. ఔట్ పేషంట్ రిజిస్ట్రేషన్ విభాగంలో ఉన్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఆసుపత్రి పని చేసే వేళల్లో ఓపీ రిజిస్ట్రేషన్ విభాగంలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కచ్చితంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఆయన ఆసుపత్రి ఇంజక్షన్ విభాగం, ల్యాబ్ రిజిస్ట్రేషన్ విభాగం, ల్యాబ్‌లను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రికి ప్రతిరోజు వచ్చే ఔట్‌పేషంట్లు, ఇన్‌పేషంట్ యాక్యుపెన్సీ తదితర విషయాలపై ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.వి.శ్రీనివాస్‌రావును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, ఆసుపత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ రాకేష్, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు

గోల్కొండ: గంజాయికి అలవాటు పడిన యువకులు స్వయంగా గంజాయి అమ్మే ముఠాగా అవతారమెత్తారు. వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుదీంద్ర తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం ఉదయం మాసాబ్‌ట్యాంక్ వస్ట్‌లాన్సర్ ఈద్గా గ్రౌండ్ వద్ద కొందరు వ్యక్తులు గంజాయి తాగుతున్నారని సమాచారం అందడంతో వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జంగయ్య, హ్యూమాయిన్‌నగర్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్‌తో కలిసి పోలీసులు ఈద్గా గ్రౌండ్‌కు వెళ్లారు. అక్కడ గంజాయి తాగుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మాసాబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్‌గా నమోదై ఉన్న మహ్మద్ సోఫియానుద్దీన్(24) సాయంతో మాసాబ్‌ట్యాంక్ పోచమ్మ బస్తీకి చెందిన సయ్యద్ దావుద్ అలీ, ఈద్గా గ్రౌండ్‌కు చెందిన సయ్యద్ రోమాన అలీ, కిషన్‌బాగ్‌కు చెందిన మహ్మద్ అయూబ్‌తో ఒక టీమ్ ఏర్పడ్డారు. వీరు మహ్మద్ సోఫియానుద్దీన్ ఆదేశాల మేరకు మహారాష్ట్ర నాగ్‌పూర్ తాజ్‌బాగ్ దర్గాకు వెళ్లి అక్కడ నుంచి గంజాయి తేవడం ప్రారంభించారు. ఇదిలా ఉండగా వీరు ఈద్గా గ్రౌండ్ వద్ద గంజాయి అమ్ముతున్నారని విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు, హ్యూమాన్‌నగర్ పోలీసులతో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయి, ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని వారిని సోమవారం రిమాండ్‌కు తరలించారు.

యువకుడిపై దాడి

- నగదు.. సెల్‌ఫోన్ లాక్కొని పరార్
- నిందితుల్లో ఇద్దరు మైనర్లు

రాజేంద్రనగర్: నడుచుకుంటూ వెళ్తున్న ఓ యువకుడిని ఇద్దరు మైనర్ బాలులతో పాటు మరో యువకుడు బెదిరించి సెల్‌ఫోన్‌తో పాటు నగదును తీసుకొని పారిపోయారు. యువకుడు ప్రతిఘటించడంతో మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ సంఘటనలో గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల సమాచారం మేరకు... అత్తాపూర్‌కు చెందిన సురేశ్ ఆదివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో హైదర్‌గూడ రహదారి గుండా కాలినడకన వెళుతున్నాడు. ఇదే సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ యువకుడితో పాటు ఇద్దరు మైనర్లు సురేశ్‌ను అడ్డగించి సెల్‌ఫోన్‌తో పాటు నగదును లాక్కున్నారు. ప్రతిఘటించిన సురేశ్‌పై ముగ్గురు దాడి చేయడంతో తల, మోకాలుకు గాయాలయ్యాయి. సెల్‌ఫోన్‌తో పాటు నగదుతో దుండగులు ఉడాయించారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన సురేశ్‌ను ఆస్పత్రికి తరలించారు. సోమవారం ఉదయం ఇదే ప్రాంతంలో తిరుగుతున్న ఇద్దరు మైనర్లను పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి



గోల్కొండ: సైబర్ నేరగాళ్ల రోజురోజుకూ త మ పంథా మారుస్తూ ఆర్థిక దోపిడీకి కొత్త బాటలు ఎంచుకుంటున్నారని అటువంటి వారితో జాగ్రత్తగా ఉండాలని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. గోల్కొండకు చెందిన ఓ వ్యక్తి కేవలం ఫోన్‌పై మీకు హల్దీరామ్ డీలర్‌షిప్ ఇప్పిస్తామంటూ కోల్‌కత్తకు చెందిన ఓ వ్యక్తి రూ.75 లక్షలు దోచుకున్నాడని ఆయన అన్నాడు. అదే విధంగా నకిలీ ఇంటి, భూమి డాక్యుమెంట్లు తెచ్చి వాటిని ఒరిజినల్‌గా నమ్మిస్తూ అమ్మజూపుతున్నారని అటువంటి వారిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైబర్ నేరాలు, నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని ఎన్నో రకాలుగా ప్రచారం చేస్తుయాన్నారు. అయినా కూడా అత్యాసకు పోయి కొందరు అమాయకులు సైబర్ నేరగాళ్ల ఊబిలో చిక్కుకొని డబ్బులు పోగొట్టుకుంటున్నారన్నారు. ఫోన్‌లో కపట మా టలతో ఎక్కువ డబ్బులు ఇప్పిస్తామంటూ ఎరవేస్తున్నారని తక్కువ ధరకే ఇళ్లు, ప్లాట్లు ఇప్పిస్తామని ఓటీపీ ద్వారా బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బులుకాజేస్తున్నారన్నారు. ఇటువంటి కాల్స్ వస్తే వెంటనే సైబర్ కార్యాలయాలకు స్థానిక పోలీసులకు తెలపాలన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థులకు అరుదైన అవకాశం

రాయదుర్గం: స్పార్క్ ప్రాజెక్టులో భాగంగా హెచ్‌సీయూ డాక్టోరల్ విద్యార్థులు క్వీన్స్‌ల్యాండ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. హెచ్‌సీయూలోని ప్రొఫెసర్ కాంచన్ కె మాలిక్, ట్రీసారీనా జాన్ మార్గదర్శకత్వంలో పనిచేస్తున్న వంశీకృష్ణ, హెచ్‌సీయూ కమ్యూనికేషన్ విభాగానికి చెందిన ఇద్దరు పరిశోధక విద్యార్థులు ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లోని క్వీన్స్‌ల్యాండ్ విశ్వవిద్యాలయ సందర్శన సోమవారంతో ముగిసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా మూడు కమ్యూనిటీ రేడియో స్టేషన్‌లను సందర్శించారు. ఆదివాసీ, టోర్రెస్ స్ట్రెయిట్ ద్వీపవాసుల కమ్యూనిటీలకు స్వదేశీ కార్యక్రమాలు అర్థం చేసుకోవడానికి ఎలా ఉపయోగపడిందో తెలుసుకున్నారు.

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తిచేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హుల ఎంపిక ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. సోమవారం కిస్మత్‌పూర్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకంలో భాగం ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గెజిటెడ్ అధికారుల ద్వారా ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల జాబితా వెరిఫికేషన్, వార్డు అధికారుల ద్వారా రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల వెరిఫికేషన్ జరుగుతోందన్నారు. గెజిటెడ్ ఆఫీసర్‌లకు, వార్డు ఆఫీసర్‌లకు కార్యాలయ ఉత్తర్వులు జారీ చేసి ప్రభుత్వ మార్గదర్శకాలు వివరించామన్నారు. నియమనిబంధనల ప్రకారం లబ్ధిదారుల జాబితా వెరిఫికేషన్ చేసి అర్హత ఉన్న వారిని గుర్తించాలన్నారు. మేనేజర్ ఇ.మంజులత, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఆర్‌వో కె.శివకుమార్, ఏఈఈ వి.రాజ్‌కుమార్, వివిధ సెక్షన్ల అధికారులు, అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కిస్మత్‌పూర్‌లో ఇంటింటికీ వెళ్లి...

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా వెరిఫికేషన్ ప్రారంభమైంది. సోమవారం కార్పొరేషన్ కమిషనర్ కిస్మత్‌పూర్‌లోని లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వెరిఫికేషన్ చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వెరిఫికేషన్ చేసి అర్హులైన లబ్ధిదారుల జాబితాలను ఉన్నతాధికారులకు సమర్పించనున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ ఎం .యాదయ్య, బిల్ కలెక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్యులు సంఘటితం కావాలి

ఆవోపా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్



సమావేశంలతో పాల్గొన్న ఆర్య వైశ్యులు

మణికొండ: వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయ నిర్మాణానికి మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఆర్య వైశ్యులంతా సంఘటితం కావాలని ఆవోపా జిల్లా అధ్యక్షుడు బి.శ్రీధర్ అన్నారు. సోమవారం మణికొండలో జరిగిన ఆర్యవైశ్యుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మే 3వ తేదీన రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత మణికొండకు వస్తున్నారన్నారు. అమ్మవారి గుడి సాధనకు మన వంతు ప్రయత్నాన్ని ప్రోత్సహించేందుకు ఆమె తన వంతు కృషి చేస్తారన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఆర్యవైశ్యులంతా సమావేశంలో పాల్గొనాలన్నారు. అమ్మ వారి ఆలయ నిర్మాణంలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అన్ని ఆర్యవైశ్య సంఘాలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో నేతలు ఎర్రం శ్రీనివాస్, కె.నాగరాజు, సమత, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

మిలటరీ స్థలం సమస్యను పరిష్కరించండి

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిని కోరిన నాయకులు



కేంద్ర మంత్రిని కలిసిన అలకాపూర్ నాయకులు

మణికొండ: వేలాది మంది ప్రయాణానికి అడ్డంకిగా ఉన్న మిలటరీ స్థలంను రోడ్డుకు కొంత కేటాయించి సమస్యను పరిష్కరించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను గ్రేటర్ అలకాపూర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ కోరారు. సోమవారం నగరంలోని కేంద్ర మంత్రిని కలిసి నార్సింగి రేడియల్ రోడ్డు-4 నుంచి మణికొండ రేడియల్ రోడ్డు-5కు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో లింక్ రోడ్డును మంజూరు చేసి కొంత వరకు పనులను చేపట్టిందని వివరించామని తెలిపారు. కొద్ది దూరం మిలటరీ భూమి ఉండటంతో వారి అడ్డంకితో లింక్ రోడ్డు పనులు పూర్తి కాలేదని, ఆ అడ్డంకిని తొలగించి ప్రజల దూరాభారాలను తగ్గించాలని కోరామన్నారు. అందుకు మంత్రి త్వరలోనే అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికుల వ్యాక్సినేషన్ క్యాంప్ ప్రారంభం



హజ్ యాత్రికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గోల్కొండ: హజ్ యాత్రకు ఎంపికైన వారికి ప్రభుత్వపరంగా అవసరమైన అన్ని పనులు సకాలంలో పూర్తి చేయిస్తామని రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యా నిర్వహణ అధికారి సజ్జద్ ఆలీ అన్నారు. సోమవారం ఈ సంవత్సరం హజ్ యాత్రకు ఎంపికైన వారి కోసం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో వ్యాక్సినేషన్ కేంద్రాల సంఖ్య తక్కువగా ఉండేదని దీని వల్ల హజ్ యాత్రికులు గంటల తరబడి క్యూలో నిలపడేవారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హజ్ యాత్రికుల కోసం వ్యాక్సినేషన్ కేంద్రాలను పెంచిందన్నారు. దీని వల్ల హజ్ యాత్రకు వెళ్లే సీనియర్ సిటిజన్స్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి వైద్య పరీక్షల నిమిత్తం క్యూలు కట్టే తిప్పలు తప్పాయన్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఐదు రోజుల పాటు వ్యాక్సినేషన్ సెంటర్ ఉంటుందన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడి ఈ వైద్య శిబిరాలు సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు హబీబ్ జైనులాబీద్దున్ ఆబీద్, ఇలియాస్ అలీ, మోహిన్, రాష్ట్ర హజ్ కమిటీ ఏఈఓ ఇర్షాద్ తదితరులున్నారు.

ఐఎన్‌టీఎస్‌ఓలో సత్తాచాటిన విద్యార్థులు

గోల్కొండ: జాతీయ స్థాయిలో నిర్వహించిన ఐఎన్‌టీఎస్‌ఓ పరీక్షలో మెహిదీపట్నం శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభచాటారు. జాతీయ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో గెలిచిన వారికి సోమవారం పాఠశాలలో ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. ఈ పరీక్షల్లో ఒకరికి మొదటి బహుమతిగా ల్యాప్‌టాప్, ద్వితీయ బహుమతి ఇద్దరు సాధించారు. అదే విధంగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో కూడా తమ విద్యార్థులు బహుమతులు గెలిచారని ప్రిన్సిపాల్ స్వాతి తెలిపారు. తమ పాఠశాలకు చెందిన మొత్తం 181 మంది గోల్డ్ మెడల్స్ సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం కృష్ణ, ఆర్ఐ హరికృష్ణ, డీన్ మల్లేష్, ఇన్‌చార్జీలు బాలరాజు, చబుస్తా, నదీమ్, రవి, కో ఆర్డినేటర్ ప్రవీణ్, జైపాల్‌రెడ్డి తదితరులున్నారు.



ఐఎన్‌టీఎస్‌లో సత్తాచాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ స్వాతి తదితరులు